# రిబ్బను ముక్క

**సా**యంత్రం విశ్రాంతి తీసుకుంటోంది. సూర్యుడికి విసుగొచ్చి తొందరగా వెళ్ళిపోతున్నాడు. చంద్రుడు ఇవాళ ఆలస్యంగా వద్దామని నిశ్చయించుకున్నట్టున్నాడు. సన్నగా పాడుతోంది చల్ల గాలి. ఆ పాటకి చిన్న చిన్న గడ్డిపరకలు పెద్ద సంగీత విద్వాంసుల్లా తలలూపుతున్నాయి.

అదో పెద్ద అందమైన బంగళా. బంగళాచుట్టూ రకరకాల పూలమొక్కలు. బంగళాకొకవైపున్న లాన్‌లో తన్మయుడై ఆకాశం వైపు, ఆకాశంలో కరిగిపోయే మేఘాల వైపు చూస్తున్నాడు డాక్టర్. ప్రక్కన ఎన్నో కుర్చీలున్నా పచ్చిక మీద పడుకొని పరవశమవడం అతని అలవాటు. ఏదో ఆలోచిస్తున్నట్టున్నాడు. ఏ మాలోచిస్తున్నాడో చెప్పటం కష్టం. చీకటి పడుతున్నా యింకారాని తన స్నేహితుల గురించికావచ్చు, లేక యింతకు ముందే తాను అతిప్రయాస పడి యీ ప్రపంచంలో ప్రవేశ పెట్టిన పసికందు గురించైనా కావచ్చు. ఇవేవీకాక దూరంగావున్న మొక్కలమీద రంగు చినుకుల్లావున్న పూల గురించేనా కావచ్చు.

"ఏమిటి ! డాక్టరుగా రొక్కరూ కూర్చుని అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" అంటూ ప్రవేశించేడు స్నేహితుడు విశ్వనాథం.

విశ్వనాథం మాటలకు డాక్టరు యిహ లోకంలోకి తూలిపడ్డాడు.

"నేనేదో ఆలస్యం చేసేననుకొని తొందర తొందరగా వచ్చేసేను. నేనే ముందొచ్చే నన్నమాట. ఏమిటండీ బాబూ ! అశోక వృక్షం క్రింద సీతాదేవిలా పడుకున్నారు?" అన్నాడు మళ్ళీ విశ్వనాథం డాక్టరు పక్కనే కూర్చుంటూ. తను చాలా హ్యూమరస్‌గా మాట్లాడతానని విశ్వనాథం నమ్మకం. తాను చిన్ననాడు స్కూలు నాటకంలో వేసిన హాస్యపాత్రకు బహుమతికూడా వచ్చిందని చెప్పుకుంటూ వుంటాడు. ఎప్పుడూ ఏదో ఒకటి అతను హాస్యం అనుకొనేది మాట్లాడితేకాని తోచని స్వభావం. డాక్టరు చిన్నగా నవ్వి పూరుకున్నాడు.

"ఏమిటండీ బాబూ! అంత మీలో మీరే నవ్వుకుంటున్నారు. ఒకవేళ మీ ఏకాంతాని కడ్డువస్తున్నానేమో! పోనీ పోతాను" అంటూ లేవబోయిన విశ్వనాథాన్ని "ఫర్వాలేదు. కూర్చోండి" అంటూ డాక్టరు కూర్చోపెట్టేడు.

"అప్పుడే చీకటి పడుతోందండోయ్! మనముతావాళ్ళెవరూ యింకా రారేం? ఈ వెధవ శీతాకాలంలో యిట్టే చీకటి పడుతుంది సుమండి. ఆఫీసునుండి యింటికొచ్చేసరికే దీపాలు పెట్టేస్తున్నారు" అన్నాడు మళ్ళీ విశ్వనాథమే.

డాక్టరు చిరునవ్వే అతనికి సమాధానం.

"మీకు పూలమొక్కల్లో ఎంత ఇంటరెస్టండీ. నిజంగా పూళ్ళోవున్న పార్కులోకూడా యిన్నిరకాల మొక్కల్లేవంటే నమ్మండి" చుట్టూవున్న మొక్కలని చూస్తూ మెచ్చుకున్నాడు విశ్వనాథం.

"సారీ! ఇవాళ ఏదో వెధవ కాంట్రాక్టుపని చూసేసరికి బాగా లేటయిపోయింది" అంటూ ఇంజనీర్ సిరాజ్ వచ్చి విశ్వనాథం ప్రక్కనే చతికిలపడ్డాడు. ఆరడుగుల పైచిలుకు పొడువున్న సిరాజ్ తన తోటివారికంటే నైతికంగాను, శారీరకంగాను ఎంతో ఎత్తున ఉన్నట్టుంటాడు.

"అదేమిటి! మీరుకూడా క్రింద కూర్చున్నారు? ఫర్వాలేదు. కుర్చీలో కూర్చోండి. నాకిలా పచ్చికమీద పడుకోవడం అలవాటేగా" అన్నాడు డాక్టరు.

"ఐనా యింతవరకూ ఆ కుర్చీల్లో కూర్చున్న వాళ్ళమే కదటండీ, కాసేపు మెత్తగా ఇక్కడే కూర్చుందాంలెండి" అన్నాడు సిరాజ్ ఓ కుర్చీకి చేరబడుతూ.

"డాక్టరుగారి కివాళ పని యెక్కువ వున్నట్టు లేదే? తీరుబడిగా పడుకున్నారు" అన్నాడు విశ్వనాథం బోర్లాపడుకొని గడ్డిపరకల్ని లెక్క పెడుతున్న డాక్టరుతో. డాక్టరు సమాధానం చెప్పేలోగానే "ఆఁ! ఆఁ! తీరుబడిగా పడుకోరూ మరి? తన పనీ, నాపనీకూడా నాకే అప్పగిస్తే తీరుబాటుకాక యింకేమిటి? అయ్యో! అదొక్కర్తే అఘోరిస్తోంది. పోనీ కాస్త సాయం చేద్దామన్నమాట ఏకోశానా ఉంటేగా?" అని అంటూ సుడిగాలిలా చీదరగావచ్చి డాక్టరు పక్కనున్న కుర్చీలో కూర్చుంది డాక్టరుభార్య డాక్టరు విశాల. కుడీఎడమా భేదం లేకుండా మాట్లాడే స్వభావం ఆమెది. విభిన్న మనః ప్రవృత్తులుగల ఆమెదీ, ఆమె భర్తదీ ఎంతో అనుకూల దాంపత్యం.

"బాగా అలసిపోయినట్టున్నారు" అన్నాడు సిరాజ్ అభిమానం ప్రతిధ్వనించే కంఠంతో.

"అలసిపోవడమాఁ ! ప్రాణాలు పోతున్నాయంటే నమ్మండి. అందులోనూ యీ డెలివరీ కేసులున్నాయే ఒక వేళా పాళాలేదు.

ప్రాణాలు తోడేస్తున్నాయనుకోండి. అయినా వీటికి ఒకసీజనో లేక పోతే ఒక టైమో వుంటే బాగుండును" అంది విశాల అతి చిరాగ్గా.

"గిరీశం చెప్పినట్టు ప్రపంచంలో చైల్డ్‌విడోస్ ఎక్కువ మంది వుంటే మాత్రమ కొంతతగ్గేదేమో" అన్నాడు విశ్వనాథం మామూలు ప్రకారం తనకులేని హ్యూమర్ ప్రదర్శిస్తూ.

"అప్పుడు మాత్రం ఏమిటి మహా గ్యారంటీ" సమా ధానం చెప్పింది విశాల .

డాక్టరూ, విశ్వనాథం ఒక్కసారి ఫక్కున నవ్వేరు.

వాళ్ళు ఎందుకు నవ్వుతున్నారో విశ్వనాథానికి అర్థం అయ్యేలోగా తనకాళ్ళవద్ద వెల్లకిలా పడుకొని తన చీరెకుచ్చెళ్ళు చిన్న పింజెలుగా పెడుతున్న డాక్టరుతో "ఏమిటండి బాబు! నా కాళ్ళదగ్గర పడుకున్నారు. ఇప్పటికే నేను మిమ్మల్ని కాల్చుకు తింటున్నానని, మీరు నా బానిస అని అంతా నన్ను తిట్టుకుం టున్నారు. మీకు పుణ్యముంటుంది ముందు యిక్కడినుంచి లేవండి" అంటూ దూరంగా జరగబోయింది విశాల. డాక్టరు అదేమీ గమనించకుండా ఆమె తెల్ల నేత చీరె అంచులో ఎగిరే జరీపువ్వులను, సీతాకోకచిలుకలను చూస్తూ "యీ చీర అంచు చాలా బాగుంది విశాలా. ఇది నేసిన వాడెవడో కవై యుండాలి" అని నొచ్చుకున్నాడు.

"ఎందుకండీ యీ మాయ మాటలు. ఈ చీకట్లో మీకు చీర అంచు పనితనం కన్పిస్తోందా? చేసేపనులు చేస్తూ నన్ను వుబ్బెయ్యడానికి చూడకండి. ఏదైనా అంటే పెద్ద ఆర్టిస్టు నంటారు. మీరు పెన్సిల్ పట్టుకోవడం నా కళ్లతో ఎన్నడూ చూడలేదు" అంటూ దెప్పింది విశాల.

సిరాజ్ కాళ్ళు చాపుక్కూర్చొని గడ్డిపరకలు తెంచుతూ వీళ్ళ సంభాషణ వింటున్నాడు.

"ఇదివరకు వేసేవారుట గదండి బొమ్మలు?" అంటూ డాక్ట రుని సమర్థించబోయేడు విశ్వనాథం.

"అదేనండీ నా ఏడుపు కూడా! నన్ను కట్టుకోకముందు వేసి నన్ను కట్టుకున్నాక మానేసేరంటె అర్థమేమిటి? అక్కడికి నేనేదో ఆయన బొమ్మలేసుకుంటూ వుంటే అడ్డుపడినట్టు.." విశాల మాట పూర్తిచేయకముందే...

"ఏమిటి! ఏవో బొమ్మలంటున్నారు" అంటూ వుండలా దొర్లు కొచ్చేరు లావుపాటీ బట్టతల సబ్‌జడ్జిగారు. ఆయన, ఆయనతో వచ్చిన లెక్చరరు శంకర్రావు విశ్వనాథం పక్కనే కూర్చున్నారు.

"అయ్యయ్యో! మీరంతా క్రింద కూర్చుంటే నే నేమిఁటి తగుదునమ్మా అని కుర్చీ ఎక్కేను. నేనూ కిందే కూర్చుంటాను" అంటూ లేవబోయింది విశాల.

"ఫర్వాలేదు. కూర్చోండమ్మా. మేమంతా యిప్పటి వరకు నడుం కొట్టినట్టు కుర్చీల్లో కూర్చుని కూర్చుని విసిగి పోయిన వాళ్ళమేకదా. మీ క్కూర్చోటానికే టైముండదు. ఎప్పుడూ నిల బడే వుంటారు. మీరలాగే కూర్చోండి, ఐనా యిక్కడెవరూ పరాయవాళ్ళం లేముగా" సర్దిచెప్పేరు జడ్జిగారు.

"మరీ యింత చీకటిపడేవరకూ ఆ కోర్టులో ఎలా పని చేస్తున్నారండి?" అన్నాడు సిరాజ్.

"అదేనయ్యా బాబూ! ప్రపంచం అంతా అన్యాయంతో నిండి పోతోంది. ఎంత అన్యాయం పెరిగితే కోర్టుల్లో అంత పీకలు మునిగే పనుంటుంది? పాపం పెరిగిపోతోంది. కోర్టులు నిండి పోతున్నాయి" అన్నారు జడ్జీగారు. తన జీవితంలో ఎక్కువభాగం అన్యాయం అనే వాతావరణంలోనే గడిపినా అధర్మం ఆయన సహించలేరు. అందులో ఆయనకి రోజూ భయంకరమై కొత్త దనం కన్పిస్తూనే ఉంటుంది.

"ఐతే మీ కోర్టుకి అన్యాయం, పాపమే వస్తాయంటారు?" అన్నాడు విశ్వనాథం హేళనగా,

"అధర్మం ఒక్కటే ఎప్పుడూరాదు. దాన్ని ఎప్పుడూ ధర్మం న్యాయం వెన్నంటే వుంటాయి. కోర్టుకివచ్చిన ఒకరిది అధర్మం ఐతే, న్యాయం రెండో వాడిదైయుంటుంది" తిప్పి కొట్టేరు జడ్జీగారు.

"ఐతే జడ్జిగారూ! ప్రపంచంలోకల్లా ఎక్కువ అన్యాయం ఎవ రికి జరిగిందంటారు?" విశాల చీరకుచ్చెళ్ళని వదలి ఆమె పాదా లని రకరకాలుగా పరిశీలిస్తూ ప్రశ్నించేడు డాక్టరు.

"నాకు" అంది ఠక్కున విశాల. "మీలాంటి వారిని కట్టు కోడం అన్యాయంకాక యింకేమవుతుందీ?" అని సాగదీసింది.

"ఈ మాటలకేంగాని, నామట్టుకు నాకు అందరికంటె ఎక్కువ అన్యాయం శ్రీరాముడికి జరిగిందని తోస్తుంది" అన్నాడు సిరాజ్.

"అదేమిటోయ్ ! ఇలా రాముణ్ణీ, భీముణ్ణీ ఆరాధిస్తూ మాట్లాడే వంటే నిన్ను మీ వాళ్ళంతా వెలివేస్తారు సుమా!" అన్నారు ఘొల్లున నవ్వుతూ జడ్జీగారు.

"మరి మనం అంతా మరిచిపోతుంటే అతనింకేం జేస్తాడు? ఇంత చదువుకుని మనం యిలా దేముళ్ళకి జాతులు మతాలు అంట గట్టడం అధర్మం" అంది విశాల.

"ఇంతకి జడ్జీగారు నేనడిగిన దానికి సమాధానం చెప్పేరే కాదు" మళ్ళీ అడిగేడు డాక్టరు.

"ఏం చెప్పమంటావోయ్ ! ప్రతిదీ అన్యాయమే. ప్రతీ చోటా అన్యాయమే. మాటవరస కీవేళ నేను చేసిన కేసే తీసుకో. పాపం! వాది ఒక పాతికేళ్ళమ్మాయి. చూడ్డాని క్కూడా బాగానే వుంటుంది. కొద్దో గొప్పో చదువుకుంది కూడా. చిన్నప్పుడే పెళ్ళయింది. పెళ్ళయిన తర్వాత ఆమె మొగుడు ఎందుకో ఆవి డని కాపరానికి తీసికెళ్ళలేదు. చూసిం జూసింది. ఎన్నా ళ్ళూరు కుంటుందీ? పదేళ్ళు చూసి యిప్పుడు మనోవృత్తి దావా పడే సింది.." చెప్పుకుపోతున్నారు జడ్జి గారు.

"అయినా ఆ మొగుడి కేం రోగమండీ, పాపం ఆ అమ్మాయి నొదిలెయ్యడానికి" సానుభూతిగా అన్నాడు సిరాజ్ తనూ డాక్టరు పక్కనే పడుకుంటూ.

"బహుశా ఆ అమ్మాయి పూర్వ చరిత్ర మంచిది కాదేమో" అన్నాడు విశ్వనాధం మహా తెలివిగా చెప్పా ననుకుంటూ.

"ఆ అమ్మాయెవరో సత్తె కాలందై వుంటుంది. నేనైతేనా వాడి అంతేమిటో అప్పుడే తేల్చేద్దును" కోపంగాఅంది విశాల.

"అదేం కాదు. ఆమె మొగుడు తన మామే తన కేదో అన్యా యం చేసేడంటాడు. కొందరి మనఃప్రవృత్తే అంత. అన్యా యానికీ, అధర్మానికీ పెద్ద సంఘటనలే ఉదాహరణలు కావు. మనకు ఎంత చిన్నగానో కనిపించే ఒక విషయం యింకోరికి ఎక్కువ కష్టం కలిగించవచ్చు, మనం తిట్టక్కర్లేదు, కొట్టక్కర్లేదు. మనం మోటగా ప్రవర్తిస్తేచాలు బాధపడతాడు సున్నిత హృద యం గలవాడు..." అంటూన్న జడ్జి గార్ని "మీరు చెప్పింది అక్షరాలా నిజం" అంటూ ఆటంకపరిచేడు డాక్టరు. ఒక్కక్షణం ఆగి "మీరు చెప్పింది వింటూ ఉంటే ఎప్పుడో జరిగిన సంఘ టన జ్ఞాపకం వస్తోంది" అని కలిపేడు.

"అదేదో కాస్త సెలవియ్యండి" అన్నాడు విశ్వనాధం.

"డాక్టరుగారికి ప్రతీదీ అలాంటి సంఘటనే, అసలీయన ఏ కవిత్వం రాసుకుంటూనో, ఏ బొమ్మలు గీసుకుంటూనో గడపక యీ డాక్టరీ ఎందుకు చదివేరో నా ప్రాణానికి? పేషెంటు తాలూకువాళ్ళు ఏడిస్తే చూళ్ళేరు. వాళ్లతోపాటు తనూ ఏడిచినం తపని చేస్తారు. ఏదో జీతం పారేస్తున్నారు. ఇదే ప్రైవేటు ప్రాక్టీస యితే మేమింత గడ్డి తినేవాళ్ళం" అంది విశాల.

"డాక్టర్ది సున్నితమైన హృదయం– క్రితం జన్మలో ఎంతో పుణ్యం చేసుకుంటేగాని లభించదు" అన్నారు జడ్జిగారు.

"కథ కానివ్వండి" అన్నాడు సిరాజ్ ఆత్రంగా.

"ఇంతకీ కథ అందరికీ నచ్చకపోవచ్చు" అపరాధిలా అన్నాడు డాక్టరు.

"నన్నేనా మీరు ఎత్తిపొడిచేది?" అంటూ గొణిగేడు విశ్వనాధం.

"ఆయన ఆలా ఏం అనలేదు గదండీ" విసుక్కున్నాడు సిరాజ్.

"ఇది జరిగి చాల్నాళ్ళయింది" కథ ప్రారంభించేడు డాక్టరు. "వివరాలు అస్పష్టంగా జ్ఞాపకం వున్నాయి మిగిలివున్నది మాత్రం ఒక చెరగని మాసిపోని ముద్ర" డాక్టరు ఒక్కక్షణం ఆగి మళ్ళీ ప్రారంభించేడు.

"అప్పుడు నేను మెడిసిన్ నాల్గవ సంవత్సరము చదువు తున్నాను. ఏ కాంతం కోరుకునే నాకు హాస్టలులో ఉండడం యిష్టం ఉందేది కాదు. ఎప్పుడూ ఊళ్ళోనే ఏదో గది తీసుకొని ఉండేవాడిని. ఆదివరకు నేను ఉంటున్న గది ఎందుకో ఖాళీ చేయవలసి వచ్చింది. పగలనక రాత్రనక తిరిగేను గది కోసం"

"అలా తిరగడం వల్లే కాబోలు మీకో పార్టుపోయింది" కథకి అడ్డొచ్చింది విశాల.

"కాదు విశాల! ఆ సంవత్సరమంతా ఆరోగ్యం సరిగా వుండేది కాదు. చదవ్వలసినంత చదవలేక పోయేను, పరీక్ష తప్పేను."

"ఆ విశాఖపట్టణం సంగతి వేరే చెప్పాలా? కారు షెడ్లలో కాపురం వుండేవి కుటుంబాలు. ఇళ్ళు దొరక్క చివరికెలా గయితేనేం ఒక మేడమీదవున్న ఒక్కగది సంపాదించగలిగేను. ఇంటాయన ఏదో బేంకు ఏజంటు. క్రింది భాగంలో వుండేవాడు. ఆ పురుషుడు యింట్లోవున్న అలికిడే వుండేదికాదు. ఎప్పుడు వచ్చేవాడో ఎప్పుడుపోయే వాడోగాని నా కంట పడేవాడు కాదు. ఎప్పుడూ కనిపించేది అతని భార్య. అప్పుడప్పుడు కనిపించేది అతని కూతురు. ప్రథమ కుసుమం.

ఆ తర్వాత ముగ్గురు కొడుకులున్నారు అతనికి. వాళ్ళలో ఎవరు బళ్ళోకి వెళ్ళి దెబ్బలు తింటున్నారో, ఎవరు యింట్లోనే వుండి వాళ్ళమ్మ చేతిమీదుగా ఆ భాగ్యం అనుభవిస్తున్నారో నే నెప్పుడూ పట్టించుకోలేదు. వాళ్ళ ముగ్గురికీ వయస్సు క్రమంలో వాళ్ళమ్మ పెట్టిన మువ్వరస ముద్దు పేర్లు. జెష్ట వెధన, రెండో గాడిద, చంటివెధవ. ఆవిడ కాలంలో ఉన్నప్పుడు రూపవతే అని చెప్పాలి. వయసు ముదిరేక కనినా తన సంతానం మీద ఏ మాత్రం ప్రేమలే దావిడకు. మనిషిది తెల్లతొక్కే లాలిత్యం, సున్నితం అలవర్చుకుంటే ఎంతో సున్నితంగా వుండి వుండేది. కాని వాటిజోలికి ఆమె ఎన్నడూ పోయేదికాదు.

ఈ సాయంత్రం జుట్టు దువ్వుకుంటే మళ్ళీ మర్నాడు సాయం త్రం వరకూ ఆ జుట్టు తనది కాదన్నట్టు తిరిగేది. నిరంతరం దేన్ని గురించో ఆ రాటపడుతూ అలసిపోయి గడిపేది రోజులు. ఎప్పుడు చూసినా అంట్లగిన్నో, చీపురుకట్టో చేతిలో వుండేది. ఎప్పుడూ ఎవరినో కసురుతూ, దాసీదాన్నో, బేంకు బంట్రోతునో తిడుతూ కోలాహలంగా గడిపేది కాలం. మనిషి మాటవింటే గంగాళాలు, సంక్రాంతి రోజుల్లో ఆంబోతు చుట్టూ వాయించే తాళాలు గుర్తుకు వస్తాయి. ఇంతకీ ఆవిడ తోటి స్త్రీకంటె చెడ్డదని కూడా అనలేను.

'ఒసే, అమ్మాయ్! ఆ చంటి వెధవకి మొహం కడిగేవే?' 'వీరన్నా ! జెష్ట వెధవని నిద్రలేవు. బడిటైమవుతోంది'

"ఒరేయ్ చంటీ! పాలగిన్నె ముట్టుకోకురా వెధవా, చురుకు తుంది" "ఒసే రాజమ్మా! ఇంకా అంట్ల గిన్నెల తోమి చావక పోతే పిండాకూడు ఎలా తగలెట్టేదే?" "వీరన్నా ! నువ్వు వేగం బజారుకు తగలడు. లేకపోతే కూరలు చచ్చువి, పుచ్చువి మిగు లుతాయి." ఇవీ రోజూ నాకు మేలుకొలుపు వచనాలు. ఈ రాగవరసలోనే వుండేది రాత్రి జోలపాట కూడా. వాళ్ళ కుటుం బంతో నేను ఎటువంటి జోక్యం పెట్టుకొనేవాడిని కాను. వాళ్ళకీ నాకూ ఏమేనా సంబంధంవుందంటే వాళ్ళ దాసీ రాజమ్మే. అదే నా గదికూడా ఊడిచేది.

కాలం ప్రవహిస్తోంది. రెండు ఋతువులు మారేయి నేను ఆ గదిలో చేరేక. చెప్పుకోదగినదీ, జ్ఞాపకం వుంచుకో వలసినదీ ఏమీ జరగకుండానే రోజులు గడిచిపోయేవి. ఇంతలో అనా రోగ్యం నన్ను వశం చేసుకుంది. ఆందోళన పడవలసిన జబ్బు కాకపోయినా మంచం పట్టించింది పదిహేను రోజులు. ఆ జబ్బుకి ఆహార నిబంధన లేవీ లేకపోయినా వొక సమస్య తలె త్తింది. హోటలు నుండి కాఫీ, బోజనం, బజారు నుండి సిగరెట్టు, పళ్ళు తేవడానికి ఒక మనిషి కావాల్సి వచ్చింది. రాజమ్మ ఉదయం, సాయంత్రం ఒక గంటలో క్రిందవారి పని, నా పని చేసిపోయేది. అది చాలా యిళ్ళల్లో ఊడిగం చేసేది. ఇవిగాక రిక్షాలాగే తన మొగుడికి వండి పెట్టుకోవాలి. నాకు కొత్తగా కలిగిన పనులు ఆమెచేయలేదు. కాబట్టి ఆవిడనే కోరేను ఎవరైనా ఒక పిల్లనిగాని పిల్లాడిని గాని చూసిపెట్టమని. 'దానికేం భాగ్యం బాబూ రేపంవుతా మాచిన్నదాన్ని' అంది. ఆ మర్నాడు దయమే వచ్చింది ఆమె కూతురు. నలుపైనా పేరుకుతగినట్టు లక్ష్మిలా కళకళలాడేది. ముఖంలో అర్థం లేని ఆకర్షణ, కళ్ళలోని అమాయకత్వం ఆమె కెంతో అందం చేకూర్చాయి. వయస్సు పది సంవత్సరాలు మించి వుండదు.

మొదటిరోజు ఏ పని తర్వాత ఏపని చెయ్యాలో తెలీక కంగారు పడింది. కాని మర్నాటి నుండీ నేనేమీ చెప్ప నవసరం లేకుండా సర్వం తానే చక్క పెట్టుకు పోయేది. ఏ మాటకు తిరిగి సమా ధానం చెప్పేదికాదు. విసుగు, అలసట ఆమెలో నేను చూడలేక పోయేను. ఏ పని చెప్పినా నవ్వుతూ గెంతుతూ చేసేది. సాయం త్రం యింటికి పోతున్నప్పుడు నా దగ్గరున్న పండో కాయో యిస్తే పుచ్చుకొని నేను చూడకుండా నా గదిలో వదిలి వెళ్ళి పోయేది. కేరియరులో అన్నం మిగిలితే నువ్వు తినవే అంటే తినకుండా పొట్లంకట్టి యింటికి తీసుకుపోయేది. మొదట్లో కొత్త పరిసరాలలో తినడానికి బిడియమేమో నని సంతృప్తి చెందాను. కాని బహుశా తన కుటుంబం వారి కోసం పట్టు కెళ్తున్న దేమోనన్న ఆలోచన కలిగేసరికి నేను ద్రోహం చేసిన వాడిలా బాధపడ్డాను. ఆపిల్లే పెద్దదైవుంటే నేను బాధపడి వుండే వాడిని కాను. ఆ ఈడు మన పిల్లలకు అన్నంకూడా సరిగ్గా తినడం రాదే? ఆ పిల్ల చేసిన పాపం ఏమిటి? నేను యిచ్చే విడిరూపాయలకు పరాయివాడనైన నాకు ఎందుకు వూడిగం చెయ్యాలి? ఇలాంటి ఆలోచనలతో శారీరకంగా నయమవు తున్నా మానసికంగా బాధపడే వాడిని.

రోజులు గడుస్తున్న కొద్దీ ఆ పిల్ల నాకొక సమస్యగా, ఒక వ్యధగా తయారైంది. ఆ పిల్ల మంచితనం నాకు శూలంగా గుచ్చుకొనేది. ఆ పిల్ల ఏదైనా తప్పుచెయ్యాలని, మామూలు మనిషి కుండే లోపాలు ఆమెలోనూ వుండాలని వెయ్యిదేముళ్ళకి

మొక్కుకున్నాను. నేనిచ్చినది తీసుకున్నా, కేరియర్‌లో అన్నం అది కడిగేలోగానే తినేసినా ఆ పిల్లని సామాన్యంగానే చూసి సంతృప్తి చెందేవాడిని. ఆమెవల్ల పడేబాధ ఆమెను పాపంలోకి దింపాలన్న భయంకరమైన వింత కోరికగా మారింది. జబ్బుగది వాతావరణమే దానికి కారణం అయి వుండవచ్చు. ఆఖరుకు ఆ పిల్ల చేత దొంగతనం చేయిద్దామని ఒకనాడు అనువైన చోటల్లా చిల్లరడబ్బులు పెట్టి ఆమెగదిలో వుండగా డాబామీదకు వెళ్ళిపోయేను. ఒక్క పైసాకూడా ముట్టలేదా అమ్మాయి. బహుశా డబ్బులు చూడలే దేమోనని సమాధాన పరుచుకున్నాను. ఆ మర్నాడుకూడా అలాగే చేసెను. కిటికీ వూడుస్తున్నప్పుడు కిటికీలో నేను పెట్టిన డబ్బుని కిటికీలో మరోచోట పెట్టింది. ఆఖరుకు సినిమాకు వెళ్ళమని ఒకనాడు డబ్బులివ్వ బోయేను మంచి ఆట వచ్చినప్పుడు తీసుకెళ్తానంది.

ఓటమి ఆనందంగా అంగీకరించేను. ఆమెను పాపానికి దింపిన పాపం అంటుకోలేదని సంతోషించేను. ఆ తర్వాత ఆమెను ఒక పరాయి మనిషిగా చూడలేక పోయేను. ఆత్మీయు రాలిగా అంగీకరించి సంతృప్తి చెందేను. ఆమెలో దైవత్వం చూడగలిగేను.

నీటిలో సుళ్ళులా రోజులు దొర్లిపోతున్నాయి. నాపని కోసమే నియమింపబడినా ఆ పిల్లను పూర్తిగా వినియోగించుకొనే దాయింటావిడ. ఆ పిల్లకు అందువలన ముట్టే ప్రతిఫలం చీవాట్లు, చీదరింపులు. నా ఆరోగ్యంగా బాగా కోలుకోగల్గేను. కాని యింకా నీరసంగా వుండడం వల్లనై తేనేమి, ఆ పిల్లకు తృణమో, ఫణమో ముట్టచెప్దా మనైతేనేమి హోటలు భోజనమే చేసేవాడిని. ఈలోగానే సంక్రాంతి వచ్చింది. వరసగా వారం రోజులు శలవులు వచ్చేయి. శలవల్లో స్వగ్రామం పోదామని నిశ్చయించుకున్నాను.

ఆ రాత్రి బయలు దేరుతాననగా యింటి వారమ్మాయి లక్ష్మితో సహా నాగదిలోకి వచ్చింది. ముచ్చటగా ముద్దబంతి పూవులా ముస్తాబయింది. పండుగకు కుట్టించుకున్న పచ్చపట్టు పరికిణీ, కెంపురంగు జాకెట్టు తొడుక్కొని నాకు చూపించాలని వచ్చింది. ఆమె అలంకరణలో చూడగానే ఆకర్షించేది ఆమె తల్లోని లేత నీలి నైలాన్ రిబ్బను. ఇటునుండి చూస్తే అటు కని పిస్తూ తూనీగ రెక్కలా వుంది. దాని మీద అక్కడక్కడ ఎగిరే చిన్న రంగుల రంగుల పిట్టలున్నాయి. బట్టలు బాగున్నాయని మెచ్చుకున్నాను. సంతోషించి వెళ్ళిపోయిందా అమ్మాయి.

ఆ అమ్మాయిని చూసిన కళ్ళతో చినిగిన గౌను, రేగిన జుట్టులో వున్న లక్ష్మిని చూసి నన్ను నేను క్షమించుకో లేక పోయేను. పేగులు ముడిపడినట్టయింది. కాని మనలోలేని సద్గు ణాలు ఆ నిర్భాగ్యురాల్లో వున్నాయి. అవే ఆమె సిరి అని నన్ను నేను మోసం చేసుకున్నాను. సాయంత్రం మామూలుగా కేరియర్ తీసుకొని వచ్చింది. 'నేను ఊరెళ్ళి పోతున్నాను, కేరియరు నువ్వు యింటికి పట్టుకుపో' అన్నాను. ఇద్దరం డాబామీదకు వచ్చేము. సాయంత్రం ఏడయింది. రాత్రి సాయంత్రాన్ని తరుముతోంది. రోడ్డు మీద జనం సముద్రంలా రొద పెడుతున్నారు. నేను తలుపు తాళం వేస్తూవుంటే గోడనానుకుని నిలబడింది లక్ష్మి. కళ్ళల్లో ఎన్నడూ లేని ఆత్రం, దైన్యం కనిపించేయి. నా చెల్లెలిని వదిలి వస్తున్నప్పుడుకూడా నాకు అంత బాధ ఎన్నడూ కలగ లేదు. గుండె కొట్టుకొనే క్రమం ఒకసారి తప్పింది. సుఖాన్ని వున్న ప్రాణానికి యీ బంధం కలిగించి ఎందుకు దుఃఖం కలి గించుకున్నానా అని కూడా విసుక్కున్నాను. విసుక్కున్నందుకు పశ్చాత్తాపంగా ఆమెమీద జాలికూడా ఎక్కువైంది. మట్టి పట్టి వున్నా ఆమె బుగ్గలు తాకకుండా వుండలేకపోయేను.

'ఏం కావాలి లక్ష్మి' అన్నాను. నేలనిచూస్తూ అర్ధ రూపాయి కావాలంది దీనంగా. స్వర్గం చేతిలో పెట్టినట్టయింది నాకు. గుడ్డిగా డాబా మీద పడుతున్న వెన్నెలకి పరిమళం వచ్చినట్ట యింది. నా జన్మ సఫలం అయిందనిపించింది. వెంటనే జేబులో నుండి అర్థరూపాయి తీసియిచ్చేను. గుప్పెట్లో దాచుకుంది. మౌనంగా మెట్లవరకు వచ్చేము. డబ్బు ఏం చేస్తుందో నన్న కుతూహలం, తన తమ్ముళ్ళకి పండుగకు ఏవైనా కొంటానంటు దేమోనన్న భయం నన్ను వశంచేసుకున్నాయి. కాని కుతూహలం జయించింది.

'ఏం చేస్తావీ డబ్బు?" సాధ్యమైనంత మెత్తగా అడిగేను. ఆ అమ్మాయి రిబ్బనులాంటిది కొనుక్కుంటానంది మృదువుగా. నా మనసు తేలికైంది. ఆ పిల్లకు కలగక, కలగక, కలిగిన కోరిక తీరడానికి సాయపడగలిగేనని గర్వించేను విడిపోయే ముందు సోమవారం మధ్యాహ్నానికి తిరిగి వస్తాను, కేరీయరు తెచ్చివుంచమని చెప్పేను. కృతజ్ఞతతో తల వూపింది. రైల్లో లక్ష్మే నన్ను కలవర పరచింది. పట్టు బట్టలు కోరలేదు, బంగారు నగలు కోరలేదు. కోరినదల్లా ఓ రిబ్బనుముక్క నాటిరాత్రి నా కలలో రిబ్బనుముక్కలు, అర్థ రూపాయలు మరవలేకపోయేను.

సంక్రాంతి రంగులతో వచ్చింది. మా యింట్లో కోలా హలంగా వున్నారంతా. కాని నాకుమాత్రం ఏదో విలువైన వస్తువు పోగొట్టు కొన్నట్టనిపించింది. కొత్త బట్టల్లో ఏ పిల్లని చూసినా లక్ష్మి గుర్తుకువచ్చేది. సోమవారం ఉదయం బయలుదేరుతూంటే రాక రాక వచ్చేవు మరొక పూట వుండమన్న అమ్మమాట కాదన లేక పోయేను. సాయంత్రం ఇల్లు వదులుతున్నప్పుడు నా జీవి తంలో మొదటిసారిగా సంతోషించేను. కాని నన్ను ప్రాణ ప్రదంగా చూసుకునే వదిన నేనను కోకుండా నన్ను దిగబెట్ట డానికి స్టేషనుకి రావడం రైలు కదులుతూ వుంటే రెండవవైపు చూస్తూ జాలిగా 'బారసాలకు తప్పక రావయ్యా' అని అర్థించడం బాధపెట్టేయి. పదేళ్ళు కాపురం చేసిన ఆమెకు అదే తొలికాన్పు.

రైలు రెండుగంట లాలస్యంగా చేరింది. ఇల్లు చేరేసరికి రాత్రి ఎన్నిమిదిన్నర దాటింది. వదినెకు ఏ పిల్ల పుడుతుందా అని ఆలోచిస్తూ మెట్లెక్కుతున్న నాకు డాబామీద గోడకి ఆనుకొని ముడుచుక్కూర్చున్న లక్ష్మిని చూసే సరికి ప్రాణం ఎగిరి పోయింది. ప్రక్కనే కేరియరు వీధిలైటుపడి మెరుస్తోంది. సంక్రాంతి చలి ఎముకలు కొరుకుతోంది. చినిగి పేలికలైన గౌను కూడదీసుకుని చలికి అడ్డం కట్టడానికి ప్రయత్నిస్తోంది లక్ష్మి. అంతవరకు ఆ పిల్ల నా కోసం కాసుక్కూర్చుటుందన్న ఆలోచనే లేదు నాకు. గది తాళం తీస్తూ 'కిందవరండాలో కూర్చో లేక పోయావా లక్ష్మీ' అని ప్రశ్నించేను. ఆమె జవాబివ్వలేదు. కేరియరు రేపు తోముకోవచ్చని చెప్పి ఆమెను యింటికి పంపించేశాను.

ఆ మర్నాటి నుండి కాలేజీలో ఏవో ఫంక్షన్సు జరుగుతూ వుండడంవల్ల రూము గురించి ఎక్కువగా పట్టించుకోలేదు. కాలేజీలో నాటకాలూ, డైరెక్షనూ, ఆటలలో మునిగి తేలు తున్నాను. నేను నిర్లక్ష్యం చేసినా లక్ష్మిలో మార్పు గమనించ కుండా వుండలేక పోయేను, కళ్ళల్లో పూర్వం మెరుపు స్థానే దైన్యం నైరాశ్యం ఆక్రమించు కున్నాయి. పెదవుల మీద చిరు నవ్వు చెరిగిపోయింది. అడుగుల్లో బరువు కన్పిస్తోంది. నేను వూరు చేరిన నాల్గోరోజుకల్లా ఆమెలోని మార్పు పూర్తిగా గ్రహించ గలిగేను. అలా వున్నా వేమని అడిగితే ఏం లేదంది.

మరో మూడ్రోజులు గడిచేయి. అప్పటికి గానీ నా మంద కొడి బుర్రకి లక్ష్మి కోరుకున్న రిబ్బను జ్ఞాపకం రాలేదు. 'రిబ్బను కొనుక్కున్నావా' అని ఆశగా అడిగేను. కొనుక్కున్నానని తలవూపింది. 'మరి పెట్టుకోవేం' అని అడిగేను జవాబుగా రెండు బొట్లు ఆమె కళ్ళనుండి జారేయి. 'ఏం జరిగింది లక్ష్మి' అని బుజ్జగించేను సంక్రాంతినాడు వాళ్ళమ్మకి నలతగా వుంటే ఆవిడ బదులు తనే ఏజంటు గారింటికి పనికి వెళ్ళిందట. పనిలోకివస్తూ కొనుక్కున్న రిబ్బను పని అయ్యేక వీధిలో కూర్చుని వేసుకుందట. అప్పుడు ఏజంటుగా రమ్మాయి ఎక్కడికో వెళ్లిం దట. వాళ్ళమ్మాయి రిబ్బను దొంగిలించిందని, తక్కువవాళ్ళకు దొంగబుద్ధు లెక్కడకు పోతాయని తిట్టి ఆ రిబ్బను లాక్కుందట ఆ యింటి కాళి. 'నేను కొనుక్కున్నాను మొర్రో, మీ అమ్మాయి రిబ్బను మీ అమ్మాయి పెట్టుకొనే వెళ్ళింది. కావలిస్తే ఆమె వచ్చాక చూడండి' అని లక్ష్మి మొత్తుకున్నా లక్ష్యం పెట్టలేదట.

మళ్ళీ కొనుక్కుందాం పరవాలేని నేను చేప్పేలో గానే మేకల మందలా ప్రవేశించేరు నా స్నేహితులు. కాలేజీ ఫంక్షన్ల హడా విడివల్ల వాళ్ళతోనే హాస్టల్లో మూడు రోజులుండి పోవడానికి అదివరకే అంగీకరించెను. ఆ రాత్రి, ఆ తర్వాత మూడురోజులు కేరియరు తేవద్దని లక్ష్మితో చెప్పి కావలసిన బట్టలు తీసుకొని వెళ్లి పోయేను.

"చూడండి! ఇది అన్యాయం కాదా? ఆ పిల్ల మన పిల్లలకంటే ఏం తక్కువ? మన పిల్లలు చాకొలెట్లు, బిస్కట్లు కావాలని ఏడు స్తుంటే ఆపిల్ల ఒక్క అర్ధరూపాయి ఖరీదుచేసే రిబ్బనుముక్క కోరింది. తీరే అవకాశం కూడా యిచ్చేడు భగవంతుడు నా రూపంలో. కోరినది చిక్కేక, అనుభవించేలోగానే విధి వెక్కిరిం చింది. ఆయింటావిడి రూపంలో. కాళీప్రత్యక్షమై పసిపిల్ల కోరికనే బలిగా తీసుకుంది. ఇదంతా ఆ ఇంటా విడకు స్ఫురించక పోవచ్చు. ఆమె దృక్పథంలో ఆ సంఘటన చిన్నదే కావచ్చు. వెయ్యి రూపాయల జీతగాళ్ళకి అర్ధ రూపాయి చిన్న పెంకే కావచ్చు.

కాని... లక్ష్మికి... ఆమెకు తీరని అన్యాయం జరగలే దంటారా? ఆ చిన్నగా కనిపించే సంఘటన మానసికంగా ఆమెను ఎంత గాయపరిచిందో ఊహించలేను గాని, బహుశా శాశ్వతంగా ఆమెకు మానవత్వంలోని నమ్మకాన్ని చంపెయ్య లేదనగలరా? ఆ యింటా విడ చేసినది అన్యాయం కాదా? ఆమెను క్షమించగలమా? రిబ్బను తీసుకోదానకి ముందు లక్ష్మి చెప్పినది నిజమో కాదో రుజువు చేసుకోవలసిన విధి లేదా? తక్కువ వాళ్ళకు తక్కువ బుద్ధులే పుడతాయన్న మనిషి తన

యెక్కువ బుద్ధి ఏమి చూపించింది? ఒకవేళ తొందరపడి తీసు కున్నా తన పొరపాటు తెలుసుకున్నా తిరిగి ఆ రిబ్బను ఇచ్చెయ్య కూడదా? ఆమెది మాత్రం దొంగతనం కాదా? అన్యాయం, అధర్మం కాదా? మీరే మంటారు?" బరువుగా ఆపేడు డాక్టరు.

ఎవరూ వెంటనే జవాబు చెప్పలేకపోయేరు. చీకటి దట్టంగా కమ్ముకుంది. అకస్మాత్తుగా గాలి లేచింది. ఆ గాలికి దూరంగా వున్న టెలిగ్రాఫ్ తీగలు రొదపెట్టేయి. ప్రక్కనే ఉన్న చింత చెట్టు మీద గుడ్లగూబ భయకరంగా అరచి రెక్కలతో పెద్ద చప్పుడు చేస్తూ ఎగిరిపోయింది.

"కథ గమ్మత్తుగానే ఉంది" తన అభిప్రాయం వెలిబుచ్చేడు విశ్వనాథం.

"ఆలోచిస్తే ఈ కథకు రెండవ భాగంకూడా వున్నట్టుంది. అది కూడా కానీండి" అన్నడు సిరాజ్.

"కావాలంటే వుంది; అక్కర్లేదంటే లేదు. ఈ కథ యిక్కడితో అంతమైవుంటే బాగుండు ననిపిస్తుంది" అని డాక్టరు తిరిగి అందుకున్నాడు.

"ఆ మూడు రోజులూ పైకి ఆడుతూ పాడుతూ గడపుతున్నా లోపల లక్ష్మి. గురించి ఆలోచన నన్ను వేధిస్తూనే వుంది. ఆమెకు జరిగిన అన్యాయాన్ని ఎప్పటికి సరిదిద్దు తానో అని ఆ రాటపడే వాడిని. హాస్టలు ఒక బందిఖానాలా కనిపించేది. రిబ్బను కొను క్కుని రోడ్డు మీద లక్ష్మికోసం పరిగెత్తితే పరిహసిస్తారేమోనని నేననుకున్న నా సహాధ్యాయులు నా పాలిటి జైలర్లులా కనిపించే వారు. ఆఖరికి తాపీగా వచ్చింది నా విడుదలరోజు. హాస్టలు వదిలి వస్తూ తోవలో లక్ష్మికి కావలసిన రిబ్బను కొనుక్కొచ్చేను. నా గది చేరేక రాజమ్మ గది ఊడవడానికి వచ్చి లక్ష్మికి మూడు రోజుల నుండి జ్వరం వస్తోందని, ఆ పూటకి తనే వీలు చూసు కొని కేరియరు తెస్తాననీ చెప్పింది. లక్ష్మి తేరుకొనే వరకూ హాస్టలులోనే భోజనం చేస్తానని చెప్పేను. గది ఊడ్చి వెళ్ళిపోతూ ఉంటే ఆవిడ చేతికి లక్ష్మి కివ్వమని రిబ్బను ఇచ్చేను. ఓ క్షణం గదిలోంచి బయటకు దూరంగా చూసి నా వైపు తిరిగి "లక్ష్మి రిబ్బను కొనమందా" అని అడిగింది తీవ్రంగా. అది నేను అనుకోని పరిస్థితి. ముందుగా ఊహించని సమస్య. రిబ్బను కోరు కుందని లక్ష్మిని హింసిస్తుందేమోనన్న భయం, లక్ష్మి కేం తేలీదనీ నేనే కావాలని యిస్తున్నానని అబద్ధమాడించింది.

మరో రెండ్రోజులు గడిచేయి. రోజూ లక్ష్మి క్షేమం రాజమ్మని అడుగుతూనే ఉన్నాను. జ్వరం తగ్గలేదని. యింకా ఎక్కువగానే ఉందని ఆమె చెప్పేది. మందిప్పిస్తున్నావా అని అడిగితే లక్ష్మిది జడపుజ్వరం, సోడాకొట్టు సాయిబుచేత మంత్రం వేయిస్తున్నానని చెప్పింది. నేనే ట్రీట్ చేద్దామంటే అప్పటికి నాకొచ్చిన వైద్యం బహు తక్కువ. లక్ష్మిది నిజంగా జడపు జ్వరమే అయితే ఆపాపం అంతా యింటావిడదేనని నిశ్చయించు కున్నాను. అభం శుభం ఎరుగని అమాయకురాలిని పట్టుకొని దొంగతనం అంటగట్టి నానా తిట్లూ తిడితే జడుసుకోక ఏమౌతుందనుకొన్నాను.

కాని లక్ష్మి పరిస్థితి విషమిస్తుందన్న ఆలోచనమూడో నాడు రాత్రి యింకో రెండుగంటలకు తెల్లవారుతుందనగా రాజమ్మ వచ్చి నన్ను లేపి చెప్పేదాకా నాకు స్ఫురించనే లేదు. 'నా కొంప మునిగిపోతుంది. లక్ష్మి నన్ను దగా చేసి వెళ్లిపోతోంది. మీరొచ్చి కాపాడండి బాబు' అంటూ నా చేతులు పట్టుకొని అర్థించింది రాజమ్మ. నాకు కరచరణాలు ఆడలేదు. ఇంతలో ఇంత మునిగి పోతుందనుకోలేదు నేను. నాకు వచ్చిన వైద్యం తక్కువ, పోనీ వచ్చినంతవరకు చేద్దామన్నా నాదగ్గర ఏ పరికరాలూ లేవు. రాజమ్మను అక్కడే వుండమని పక్కవీధికి పరుగెత్తి నాకు తెలిసిన ఒక హౌస్ సర్జనుని తీసుకొచ్చేను. పాపం: అతనుకూడా ఎంతో మంచివాడు రమ్మనగానే వచ్చేడు, తనవద్దనున్న ఏవో రెండు ఇంజెక్షనులు జేబులో వేసుకొని.

రాజమ్మను తీసుకొని బయల్దేరేం. నేను ఆ తర్వాత చాలా సార్లు చావుబ్రతుకులమధ్య ఊగిసలాడే రోగులకోసం పరిగెత్తేను. కాని ఆనాడు త్రోవలో నేను పడినబాధ వర్ణించడానికి నా మాటలు చాలవు. రోడ్లన్నీ నల్లగా అనంతంగా ఆదిశేషువులా పడుకొని వున్నట్టు కనిపించేయి. ఫర్లాంగు మైలులా కనిపిం చింది. వాచీ తొందరగా పోతున్నట్టనిపించింది. ఇంకా జోరుగా నడవలేకపోయినందుకు నా కాళ్ళని నేను తిట్టుకున్నాను. ఆ వూళ్లో అన్ని సందులున్నాయని, ఆ సందులు అంత మురికిగా వుంటాయని నాకు తెలియడం అదే ప్రథమం. జంతుజాతి ఓర్మికి నిదర్శనంగా చూరుకింద ప్రతిమల్లా నిలుచున్న రెండు గాడిదలు మినహా రోడ్లన్నీ నిర్జనంగా శ్మశానంగా వున్నాయి. పరిసరాలు వర్ణించడానికి సమయం కాదు. ఎలాగైతేనేం చేరేం కుళ్ళుకాలవ ప్రక్కనున్న ఒంటి గది లక్ష్మియిల్లు. కాలువ ఎక్కడ అంతమౌతుందో, ఇల్లెక్కడారంభమౌతుందో చెప్పడం కష్టం.

గది బురదలో నేలమీద పందిపిల్లల్లా బోర్లా పడుకుని వున్నారు యిద్దరు పిల్లలు. మూలనున్న కుక్కి మంచం మీద చింకిదుప్పటికప్పుకొని పడుకోనుంది పోల్చసాధ్యంకాని లక్ష్మి. ఆమె తల దుప్పటికి బయటవున్నా నాకు కనిపించింది నీరసించి, కృశించి బెదురుగా, భయంగా, నడికప్పువేపు చూసే ఆమెకళ్ళు మాత్రం. ఆమె మొహమంతా జేవురించి, జ్వరపీడితమైన కళ్ళు ఆక్రమించుకున్నాయి. తనని బహుశా యింకొన్ని క్షణాల్లో భస్మం చేసే అగ్ని రగుల్చుకోవడానికి వెలిగించిన జ్యోతుల్లా వున్నాయి. చూపు ఎక్కడా ఒక్కక్షణం నిలబడడం లేదు. జీవన్మరణాలమధ్య ఆమె ఊగే ఊయలలా తిరుగుతున్నాయి, ఆ ఎర్రటి నేత్రాలు. మూలనున్న గుడ్డిదీపం లక్ష్మి కళ్ళమీద భయంకరమైన క్రీనీడలు పరుస్తోంది. గది మూలనున్న చీకటిలో చావు పొంచి ఉన్నట్లని పించింది.

మేము వెళ్ళిన కొద్దిక్షణాల్లో జ్వర తీవ్రతవల్ల లక్ష్మికి వణుకు కూడా ఆరంభమయింది. వైద్యం అంత బాగా రాకపోయినా దానికర్థం నాకు తెలుసు. మృత్యువు లాక్కెళుతూ ఉంటే రాన న్నట్టు కొట్టుకుంటున్నాయి ఆమె కాళ్ళూ చేతులూ. ముఖానికి రెండుచేతులూ అడ్డుపెట్టి గట్టిగా కళ్ళుమూసుకున్నాను. మృత్యువు నా భుజంమీద చేయి వేసి నువ్వేం చేయగలవని సవాలు చేస్తున్నట్టనిపించింది. ఆ మృత్యువు నా కోసమే కాచుక్కూర్చుం దనిపించింది. చావుకు అంత దగ్గరగా వెళ్లిన నేను నా జన్మలో ఒక్కసారి నీతి కారులు, వేదాంతాలు బోధించేది అనుభవించేను. ఒక్కసారి నాలోంచి నేను బయటకి రాగలిగేను. ఇతరులూ భగవంతుడూ నన్ను ఏ విధంగా చూస్తారో, అదే దృష్టితో నన్ను నేను చూసుకోగలిగేను.

ఇంత సానుభూతీ, జాలీ వొలకబోస్తున్న నేను లక్ష్మికి చేసిం దేమిటి? మా యింటావిడకన్న నేను ఎందులో ఎక్కువ? ఆవిడ లక్ష్మిని తిట్టేది, నేను తిట్టలేదు. తిట్టకపోవడమే ఒక సుగుణమా? అంతకుమించి నాకు లక్ష్మిపట్ల బాధ్యత లేదా? ఉంటే అది నిర్వర్తించేనా? నాలుగు విడి రూపాయలిచ్చి అభం శుభం ఎరు గని ఆ చిన్న వయస్సులో చాకిరీ చేయించుకున్నానే! లక్ష్మి దైన్యానికి, దారిద్ర్యానికీ నా బాధ్యత లేదా? లోకంలో నా కోసం, నాలాంటి సుఖజీవుల కోసం ఎంతమంది లక్ష్మిలు పస్తులు పడుకొని శ్రమిస్తున్నారో? ఇది ఒక్క లక్ష్మికి సంబంధించిన విషయం కాదు. ఈ దౌర్భాగ్య దేశంలో కోట్లకొద్దీ ఉన్న అమా యక లక్ష్ములకు, తమలో మంచితనం ఉందని తమని తాము మోసగించుకునే అసంఖ్యాకులైన నావంటి అసమర్థులకు చిన్న మనసుల లేతదనం గ్రహించని మా యింటావిడవంటి వారికి కలిసి పరిష్కారంలేని సమస్య. ఈ సమస్య పరిష్కారం అయ్యే లోపున ఎంతమంది లక్ష్ములు నశించాలో?"

నే నాలోచిస్తున్నంతసేపూ నాతో వచ్చిన హౌస్ సర్జను లక్ష్మిని పరీక్షచేస్తూనే వున్నాడు. సన్నగా ఏడుస్తోంది లక్ష్మితల్లి, ఆవిడని ఓదారుస్తోంది కాటిలో ఒక కాలు పెట్టిన పక్కింటి ముసలమ్మ. హౌస్ సర్జను లక్ష్మిని పరీక్షించిన తర్వాత ఒక యింజక్షనిచ్చి ఒక అరగంట చూద్దామన్నాడు. ఆ అరగంటలోనూ ఏ మార్పూ రాలేదు లక్ష్మిలో. ఇంక యిక్కడ వుంచి లాభం లేదు. ఆస్పత్రికి తీసుకు పోదామన్నాడు. అందుకు లక్ష్మి తండ్రే రిక్షాతీస్తూ వుంటే నాకు దుఃఖం ఆగలేదు. ప్రక్కింటివాడొకాయన తన రిక్షాకూడా తెచ్చేడు.

రిక్షాలు వచ్చేక లక్ష్మికి కప్పివున్న దుప్పటితీసి జాలిగా, బాధగా ఎత్తుకుంది రాజమ్మ లక్ష్మిని. రాజమ్మ భుజం మీద నుండి వీపు వెనకాల నిర్జీవంగా వ్రేలాడుతున్నాయి లక్ష్మి చేతులు. లక్ష్మి చేతులు చూడగానే నా కళ్ళు తిరిగి పోయేయి నా కాళ్ళక్రింద భూమి కదులు తున్నట్టనిపించింది. తనపాలిటి యమపాశంలా వేలాడు తోంది లక్ష్మి చేతిలోని రిబ్బను. తనకు కలిగిన ఒక్క కోరిక తీర్చుకునే అవకాశం పొంది, పొగొట్టుకొని. తిరిగి పొందికూడా అనుభవించలేక పోతున్నదా నిర్భాగ్య రాలు, నలిగి పత్తిలా అయిందా రిబ్బను. లక్ష్మి మాత్రం మళ్ళీ మా యింటావిడ లాక్కుంటుందేమోనన్న భయంతో వున్నట్టు గట్టిగా పట్టుకుందా రిబ్బను.

రిక్షాలు బయలు దేరేయి. లక్ష్మి తండ్రి రాజమ్మని ఎక్కించు కొని రిక్షా తొక్కుతూవుంటే, లక్ష్మిని భగవంతుడు యీ ప్రపంచం లోనికి తోయడంకోసం ఉపయోగించుకున్న వీరిద్దరినీ, తిరిగి తన దగ్గరకు తీసుకుపోవడంలో కూడా ఉపయోగించుకుంటున్నా డేమోనని బాధ పడ్డాను. నేనూ హౌస్ సర్జన్ రెండవ రిక్షాలో ఎక్కేం. ఎంత శకునాల్లో నమ్మకం లేకపోయినా మారిక్షాలు బయలు దేరుతూ వుంటే తీతువు అరచినప్పుడు నా మనస్సు చివుక్కుమంది.

ప్రపంచం యింకా గాఢ సుషుప్తిలోనే వుంది. గుడి సెలపక్కని ఎవరో నలుగురైదుగురు ముక్కులు లేని వాళ్ళూ మోహాలు చినిగిన వాళ్ళూ తమ వేళ్ళులేని చేతులతో పాతకాగితాలు చిని గిన చెప్పులు మంటపెట్టుకొని చలి కాగుతున్నారు.

లక్ష్మిని హాస్పిటల్లో తొందరగానే చేర్చగలిగేము. ఎమర్జెన్సీ వార్డులోనున్న డాక్టరూ, నర్సులూ తమకు చేత నయినంతగా చేస్తున్నారు. ఈ లోపున తెల్లవారింది. అక్కడి డాక్టరూ యింకా పన్నెండు గంటలు అయితేగాని చెప్పలేనన్నాడు. ఇంక నేచేసే దేమీ లేదు. మానవుని చెయ్యి దాటి పోయింది. ఇంక లక్ష్మిని కాయగలిగింది ఒక్క భగవంతుడే. ఉదయం 7–30 గంటల య్యేక నేను నా గదికి బయలు దేరేను. తన రిక్షాలో తీసుకెళ తానన్నాడు రాజమ్మమొగుడు. కృతజ్ఞత నిండిన కళ్ళతో; వద్దని మరో రిక్షాలో బైలుదేరేను". ఇంత వరకు సిగరెట్టు కాలుస్తూ కథ చెబుతున్న డాక్టరు పొరపాటున సిగరెట్టు పొగమింగి ఉక్కిరి బిక్కిరై దగ్గుతూ ఆగిపోయేడు.

"రామ చంద్రప్రభో! ఆ అమ్మాయి చచ్చిపోతుంది కాబోలు త్వరగా కానీండి" తీర్పు చెప్పేరు జడ్జిగారు.

"ఏమోగాని నా మట్టుకు అసలు యీ కథే లేకపోతే బాగుం దుననిపిస్తోంది" అంది విశాల. పైకి వ్యంగ్యంగా కనిపించే విశాల మాటల్లోని సున్నితాభిప్రాయాన్ని గ్రహించిన డాక్టరు ప్రేమగా ఆమె మోకాలు నిమరడం ఆ చీకటిలో యితరు లెవ్వరూ చూడలేదు. పైకి విభిన్న మనఃప్రవృత్తులు కలిగినట్టు కనిపించే ఆ భార్యా భర్తలమధ్య అంత అనుకూలతకు కారణం విశాల వ్యంగ్యం లోని సున్నితం, ఆ సున్నితాన్ని గ్రహించ గల్గిన డాక్టరు మనసు.

"ఇంక చెప్పడాని కాట్టేలేదు" అంటూ డాక్టరు తిరిగి ప్రారం భించేడు. "రూముకి వస్తున్నంతసేపూ నాకు ఒక్కటే ఆలోచన– లక్ష్మీకి జరిగిన అన్యాయానికి ఎలా ప్రతీకారం చేయడమా అని. ఎంత ఆలోచించినా ఏ నిశ్చయానికి రాలేక మా యింటా విడ కొంపకి నిప్పెటేద్దామని తప్పితే అంతకన్న ఆచరణ సాధ్య మైన ఆలోచన లేవీఁరాలేదు. నేను యింటిగేటు తీసికొని ప్రవే శిస్తూ వుంటే మా యింటావిడ నవ్వుతూ నా మీదుగా రోడ్డువేపు చూస్తూ 'రావే! రా! నీకోసం పాలు మరిగించి పెట్టేను. వంటిఁ ట్లోకి పోయి తాగు నీకోసమే చూస్తున్నా' అని అదివరకు తను ఏ పిల్ల పట్లా చూపనంత మార్దవం కంఠంలో కూరుకొని ఎవరినో ఆహ్వానిస్తున్నది. నా వెనక ఏపిల్ల వుందోనని వెనక్కి తిరిగి చూస్తే గేటులోంచి ఓ వీధికుక్క ప్రవేశించబోయి మా యింటావి డని చూసి తోక ముడిచి పారిపోతూ కనిపించింది.

ఎంచేతో ఆ సంఘటనవల్ల మా యింటావిడమీద నాకున్న అసహ్యం యింకా ఎక్కువైంది. నాకు చిన్నప్పట్నించీ కుక్కల తోనూ, కాకులతోను మట్లాడే ఆడవాళ్ళంటే పరమ అసహ్యం. నేను రూములోకి పోయి నా పనులు చక్కబెట్టుకుంటూ వుంటే ఇంటి వాళ్ళమ్మాయి వచ్చింది, ఆదివరకు నా వద్ద తీసుకున్న సంక్రాంతి సంచికివ్వడానికి. ఆమెకి రెండు రిబ్బన్లున్నాయి, సీతాకోక చిలుకల్లా. అందులో ఒకటి లక్ష్మిదని నిశ్చయించు కున్నాను. అంతవరకు ప్రతీకారం సాధించడంలో మార్గం కనిపించని నాకు మెరుపులా స్ఫురిం చింది ఒక ఆలోచన. లక్ష్మి రిబ్బను ఎలాగైనా తీసుకోక తప్పదు. ఇంతకీ లక్ష్మి కథ నేను పూర్తిగా నమ్మినా అందులో నిజానిజాలు తెలుసుకో దలి చేను. 'రిబ్బన్లు చాలా బాగున్నాయి, నువ్వు కొనుక్కున్నావా' అని అడిగే నా అమ్మాయిని.

'ఓటి మా అమ్మకొంది, ఓటి నేకొనుక్కున్నా!' అందా ముద్ద బంతి.

'మీ అమ్మ ఎప్పుడు కొందీ?' మళ్ళీ అడిగేను.

'సంక్రాంతినాడు' అందాపిల్ల.

రిబ్బను తీసుకోవడమో మానడమో తేల్చుకోలేక పోతున్న నాకు సమస్య మా యింటావిడే పరిష్కారం చేసింది 'ఒరే వీరన్నా! ఆ రాజమ్మముండ ఈ వేళకూడా చావలేదు ఏమైనా అంటే నా బిడ్డకు జబ్బంటుంది. ఆ బిడ్డ చావనూ చావదు, ఇది మన పనికి రానూరాదు నువ్వే చెయ్యి చేసుకుని ఆ గిన్నెలు తోమిపెట్టు' అని క్రింద అరుస్తోందావిడ. చావు బ్రతుకుల్లో ఉన్న లక్ష్మిని ఆవిడన్న మాటలు వింటే నాకు ఒళ్ళు మండిపోయింది. ఏమైనా సరే రిబ్బను తీసుకోదలిచేను.

'ఏవితల్లీ రిబ్బన్లు చూడనీ! పట్టుకొని చూస్తాను. ఎంత బావున్నాయో!' అని అతి మెత్తగా అడిగేను.

అమాయకంగా రెండు రిబ్బన్లూ విప్పి యిచ్చింది. 'ఇందులో మీ అమ్మ కొన్నదేది' అని అడిగేను. 'ఏమో' అంది నా చాదస్తానికి నవ్వుతూ. ఆకస్మాత్తుగా ఫో! పొమ్మన్నాను. నాకు పిచ్చెత్తిందేమోనని భయపడ్డట్టుంది, ఒక్క పరుగులో కిందికి పారిపోయింది.

నేను చేసిందానికి సంతోషించాలో, విచారించాలో రెండు నిమిషాలు అలాగే నిలబడిపోయేను. ఆవేళ నేను కోపానికి లొంగినంత అంతకు ముందుగాని ఆ తర్వాత గాని ఎప్పుడూ లొంగిపోలేదు. ఉచితానుచిత విచక్షణా జ్ఞానం పూర్తిగా పోయింది. నేను ఏమి చేస్తున్నానో, ఏమి చేస్తానో నాకే తెలియడం లేదు.

ఈలోగా మా యింటావిడ గుడికి మేకపోతులా తన పిల్ల రెక్కపట్టుకుని నా గదిదగ్గరకు లాక్కొచ్చింది. ఆమె రావడం చూసి నేనే డాబా మీదకు వెళ్ళేను. ఆవిడ వస్తూనే నవ్వుతూ 'పిల్లతో హాస్యాలేమిటి? రిబ్బన్లు యిచ్చెయ్యి నాయన' అంది.

'హాస్యానిక్కాదు. నిజంగానే తీసుకున్నా' నన్నాను.

'ఎందుకు తీసుకున్నా' వంది.

'రెండు రిబ్బన్లలో లక్ష్మిదేదో మర్యాదగా చెప్తే రెండోది యిచ్చేస్తా' నన్నాను.

"మా పిల్ల రిబ్బనులు దొంగతనం చేస్తావుటయ్యా?" అంది గట్టిగా.

'లక్ష్మి రిబ్బన్లు దోపిడీచేస్తావుటమ్మా?' అన్నాను.

'నన్ను దొంగ అంటావా' అని గుడ్డురిమింది.

'దొంగవి కాదు గజదొంగవి' అన్నాను.

ఇంతలో మా యింటావిడ కంఠం మా పక్కయింట్లో ఉన్న నాలుగు కుటుంబాలని పిలకట్టుకుని లాక్కొచ్చింది; వాళ్ళ డాబా మీదికి.

వాళ్ళను చూసేక ఆవిడ రోషం ఎక్కువైపోయింది మాటా మాటా పెరిగింది.

"ఇలాంటి దొంగవెధవని యింట్లో చేరనివ్వడం నాదే తప్పు" అంది మొహం జేవురించుకొని.

"ఇలాంటి దొంగవెధవల యింట్లో చేరటం నాదే తప్పు" అన్నాన్నేను.

"ఉండు నీపని బట్టిస్తా" నంది.

"ఆ సంగతి తర్వాత చూద్దాంగాని, లక్ష్మికి ఏమైనా అన్యాయం జరిగిందో నీతల పచ్చడిచేస్తా" నన్నాను.

అంతవరకూ వచ్చాక ఆవిడకి భయం వేసినట్టుంది కాబట్టి తనకు మద్దత్తుకోసం వాళ్ళాయన్ని రమ్మని వోపాలి కేక పెట్టింది. అంతవరకూ ఆ పురుషుడికి కోపమే లేదనుకున్నాను. ఆయన చివరి మెట్టెక్కుతూ 'ఏమిట్రా ఫూల్ ఆడవాళ్ళని తిడుతున్నావ్?' అని గొంతు పెంచకుండా పీక పిసుక్కునట్టడిగేడు.

తాచులాలేచాను. 'నువ్వెవో మొగాడివేనట్రా? ట్రాష్టం' అన్నా నా కోపంలో.

అంతవరకూ పక్కింటివాళ్ళు ఆపుకున్న నవ్వు మరి ఆగలేదు. పదికప్పులూ, సాసర్లూ ఒక్కసారి నేలమీద పడినట్లు పగిలింది వాళ్ళనవ్వు.

"నీకు తెలీదు–నువ్వు వచ్చేవే" అని తన జీవితంలో తొలిసారి శాసించాడు యింటాయిన భార్యని. ఆవిడ తన జీవితంలో ఆఖరుసారి పాటించిందా శాసనం.

వాళ్ళిద్దరూ పిల్లలతో సహా మేడదిగిపోయేరు. తెలుగు సినిమాలో చివరిసీనుకు ముందు స్టంటు హీరోకు ప్రేక్షకులిచ్చే ప్రోత్సాహం నా పట్ల చూపించి మా పక్కింటి వాళ్ళు కూడా అయిష్టంగా డాబా దిగిపోయేరు. నేను గదిలోకి వెళ్ళి పోయి ఎందుకు అంత తొందర పడ్డానా – అని విచారించసాగేను. ఇంతలో ఇంటివాళ్ళ బంట్రోతు జంకుతూ ద్వారం దగ్గర నిల బడ్డారు. అంత చికాకులోనూకూడా నా కకస్మాత్తుగా పిచ్చి పట్టిందని వాళ్ళనుకుంటున్నా రేమోనన్న ఆలోచన స్ఫురించగానే నవ్వొచ్చింది. ఏజంటుగారు నన్ను మూడ్రోజులలో గది ఖాళీ చెయ్యమన్నారని అతికష్టం మీద ముక్కు కుంటూ తొట్రుపడుతూ చెప్పేడా బంట్రోతు.

"ఈ ముష్టిగదిలో మూడ్రోజులుండడం ఎందుకు? రెండు రిక్షాలుపట్రా" అన్నాను.

పందెపు గుర్రంలా పరిగెట్టాడా బంట్రోతు. వెంటనే సామాను సర్దుకొని రిక్షాలు రాగానే అప్పటికైన అద్దె ఆ జవాను మొహాన్నేసి కొట్టి నా స్నేహితుడి గదికి సామాను సహితంగా వెళ్ళిపోయేను. మేడమెట్లు దిగడం ప్రారంభించింది మొదలు రిక్షాలు బయలు దేరేవరకూ రెండు రిబ్బన్లూ రెండు చేతుల్తో విజయసూచకంగా వూపుతూనే వున్నాను. మా యింటావిడ కళ్ళు ఎర్రపడేటట్లు. ఆయిల్లు వదిలేక తలంటి పోసుకున్నట్ట యింది నాకు. లక్ష్మికూడా దేముడిదయవల్ల మరో వారం రోజుల్లో తేరుకొని తనయింటికి వెళ్ళిపోయింది" అని కథ ఆపేడు డాక్టరు.

"కథ కాదుకాని, ఎంత లండాచోరి పెట్టేరండి బాబూ" అన్నాడు సిరాజ్.

"కామిక్ ఎండింగ్ గమ్మత్తుగావుంది" అన్నాడు జడ్జీ గారు కథ తల్చుకొని నవ్వుతున్న అందరితోపాటు తనూ నవ్వుతూ.

"నాకిలా జరుగుతుందని మొదటే తెలుసు" అన్నాడు సర్వ జ్ఞుడు విశ్వనాథం.

డాక్టరుకి ఒళ్ళుమండి "ఐతే తర్వాతేమైందో చెప్పండి చూద్దాం" అన్నాడు.

"నాలుగోపార్టు కూడానా! ఇరవై నాలుగు భాగములు రిపబ్లిక్ సంస్థవారి పూర్తిస్టంటు సీరియల్" అని తప్పించుకున్నాడు విశ్వనాథం.

"అదీ కానీవోయ్" అన్నాడు జడ్జీగారు.

"ఈ భాగంలో లక్ష్మి ప్రమేయంలేదు" అంటూ తిరిగి ప్రారంభించేడు డాక్టరు. "నేను నా స్నేహితుడి గదిలో చేరిన పదిహేను యిరవై రోజులకు ఒకనాడు పది గంటలకు కాలేజీకి బయలు దేరుతూవుంటే ఠంచన్‌గా ఒక కుర్రపోలీసొచ్చి సలాంకొట్టేడు. నేనేం నేరం చేశానా అని ఆలోచిస్తూవుంటే ఆ పోలీసు నా చేతికో సమను కాగితంయిచ్చి మరోదాని మీద సంతకం పెట్ట మన్నాడు. నా ఎడ్రసు తెలుసుకోవడంలో ఆలస్యం అయిందనీ. నామీద వచ్చిన కేసు ఆవేళే అని, మేజస్ట్రీటుగారు చాలా స్ట్రిక్టు మనిషనీ, నన్ను పదకొండుగంటలకి హాజరవమనీ హెచ్చ రించేడు. నామీదేం కేసయ్యా అంటే ఏజంటు గార్నీ, అతని భార్యనీ తిట్టి, వాళ్ళ పిల్ల రిబ్బన్లు లాక్కున్నావని నామీద వాళ్ళు కేసు పెట్టేరన్నాడు.

నాకు ఒళ్ళుమండిపోయింది. 'ఆవిడా తిట్టింది. నేనూ తిట్టేను. ఆవిడ లక్ష్మి రిబ్బను అన్యాయంగా తీసుకుంటే నేను వాళ్ళ రిబ్బను పబ్లిగ్గానే తీసుకున్నాను. ఎక్కడి కక్కడ చెల్లు ఈ భాగ్యాని క్కేసుకూడానా' అని అసహ్యంతో కోర్టుకి బయలు దేరేను. కోర్టుచేరేసరికి దగ్గర దగ్గర పదకొండు గంటలయింది. కోర్టంతా శవం పోయిన యిల్లులా వుంది. మేజస్ట్రేటు గారికి మునసబు ప్రమోషను రాలేదని ఆవేళే తెలిసిందట. అతని స్టాపూ ప్లీడర్లూ అంతా విచారంలో మునిగి వున్నారు.

ఈ దుర్ముహూర్తంలో పడ్డదేంరా భగవంతుడా నా కేసు అని ఆలోచిస్తూ వరండాలో నిల్చున్నాను. చెట్టుకింద పోలీసులు ఖైదీలను పెట్టుకొని విశ్రాంతిగా సిగరెట్లు కాల్చుకుంటున్నారు. ఖైదీల్లో పాతఅనుభవంవున్న యిద్దరు ముగ్గురు పోలీసులకంటె దర్జాగా బీడీలు కాలుస్తున్నారు. కుర్రఖైదీలు మాత్రం బితుగ్గా అటూ యిటూ చూస్తున్నారు. క్రిమినల్ కోర్టులక్కూడా ఆడ వాళ్ళొలో ఒకటీ అ రాతప్పితే మిగతా వాళ్ళు చక్కా సినిమాకో, బీచికో బయల్దేరినట్టు సీతాకోక చిలుకల్లా ముస్తాబై కిల్లీలు నముల్తూ పోలీసుల్తోటి కోర్టు జవాన్లతోటి మాంచి సరదాగా మాట్లాడుతున్నారు. కోర్టులో సారాకంపు మాత్రం భరించశక్యం కాకుండా వుంది. నాక్కడపు తిప్పడం ప్రారంభించింది.

ఈలోగా పోలీసులు సిగరెట్లూ, ఖైదీలు బీడీలు ఒక్కసారి ఆడవాళ్ళు కిళ్ళీలుమ్మేసేరు, అందరి దృష్టీ గేటువేపు మళ్ళింది. అటు తిరిగిచూస్తే హుందాగా నడిచి వస్తున్నారు మేస్ట్రీటుగారు. ముందో డవాలు వేసుకున్న జవాను దారి పక్కనున్న వాళ్ళని తప్పుకోమంటున్నాడు. మేస్ట్రీటుగారి వెనకనున్న ముసలి జవాను భుజం మీద ఓ పెట్టె పెట్టుకొని అటూ ఇటూ చూడకుండా మేస్ట్రీటు గారివై పే చూస్తూ నడుస్తున్నాడు. మేస్ట్రీటుగారి చెయ్యి మాత్రం కీలు విరిగిన బందులా కిందికీ మీదికీ ఆడుతోంది. ఆయన పురజనుల నమస్కారాలందుకోవడం చూస్తే, చేస్తే మేస్ట్రీటుద్యోగమే చెయ్యాలని పించింది నాకు.

మేస్ట్రీటుగారు కోర్టుకి రాగానే బెంచి ఎక్కిపోయేరు. చూడ్డా నికి మంచి శాంతంగా వున్నారు. ప్రమోషన్ రాలేదన్న విచారం మొహంలో కన్పించడం లేదు. వరసగా కేసులు పిలవడంలో నాదో అరగంటపోయేక పిల్చేరు. కోర్టుగుమాస్తా నాకేవో కాగితా లిచ్చేడు. మేస్ట్రీటుగారు నన్ను చూసి ఒక సెకండాగి కేసు రేపటికి వేస్తున్నా, ఎవరైనా ప్లీడరుగార్ని పెట్టుకోదల్చుకుంటే పెట్టుకో అన్నారు. ఉన్న దున్నట్టు చెప్పెయ్యదల్చుకున్నా నని, ప్లీడరు గారవసరం లేదని అన్నాను. తర్వాత పూచీకత్తు రాసి బయట పడ్డాను. నాకిచ్చిన కాగితా లేవిటోనని చూస్తే ఒక్కముక్క కూడా అర్థం కాలేదు. ఆర్నెల్లు అహోరాత్రాలు వాడిన కార్బన్ కాగితం పెట్టి రాసినట్టున్నారు, అసలా కాగితా లేభాషలో రాసేరోకూడా తెలియలేదు నాకు.

మర్నాడు కూడా బుద్ధిగా టైముకు హాజరయ్యేను; నాకేసు పిల్చేరు "బేంకు ఏజంటుగార్ని, ఆయన భార్యని తిట్టి వాళ్ళ పిల్ల రిబ్బను లాక్కున్నావని నీ మీద కేసు. నేరం చేశావా? ఏమంటావ"ని అడిగేరు జడ్జిగారు. అడిగిన దానికి జవాబు చెప్పాలనుకుని "చిత్తం. వాళ్లనితిట్టిన మాటా, వాళ్ళ పిల్ల రిబ్బను తీసుకున్నమాటా నిజమే" అన్నాను. ఏమైనా అడిగితే జరిగిం దంతా చెప్దామనుకొని ఊరుకున్నాను. మేస్ట్రీటుగారు తలొంచు కొని ఏదో రాసుకోవడం మొదలు పెట్టేరు. పదినిమిషాలయ్యేక శిక్ష వేస్తారేమోనని భయం వేసింది. ఏం చెయ్యాలో తెలీలేదు. "అదికాదు సార్! ఆ రెండు రిబ్బనులు తీసుకున్నానుగాని అందులో ఓటి వాళ్ళది కాదుసార్" అన్నాను.

ఇంతలో ఎవరో కాకీ పేంటూ, నల్లకోటూ తొడుక్కున్నా యన – ఎవరో ఏ.పి.పి. గారట– "ఒకటి వాళ్ళదని ఒప్పుకుం టావు కదా! అది చాలు" అన్నాడు. నేను అతనికేదో యిస్తున్నట్టు మేజ్స్ట్రేటుగారు వెంటనే తీర్పు చెప్పేశారు. "నన్ను ఏవో సెక్షన్ల క్రింద దోషిగా భావించేరని, కాని ప్రథమనేరం అవడంవల్ల ఒక సంవత్సరం ప్రొబేషనుమీద వదిలేస్తున్నారని ఆ సంవత్సరం నేను నేరాలు చెయ్యకుండా బుద్ధిగా మంచి నడవడి కలిగి వుండాలని ఆ తీర్పు".

కథ ముగిసిపోయినట్టే, ఆ సంవత్సరం అయిపోయేక విచ్చల విడిగా, ఆవారాలా దొంగతనాలూ, ఖూనీలు చేసినా పద్ధతికీ, చట్టానికి వ్యతిరేకం కాదన్నమాట అనుకుంటూ, ఎవరో జామి నుదారుని కుదుర్చుకొని పూచీకత్తుమీద సంతకం పెట్టేను" అంటూ కథ ముగించేడు డాక్టర్.

"ఐతే మా డిపార్టుమెంటు చురుక నీక్కూడా తగిలిందన్న మాట" అన్నారు జడ్జిగారు నవ్వుతూ.

"లక్ష్మికి చావు తప్ప మీకు కన్ను లొట్టపోయిందందురూ" అన్నాడు తనూ నవ్వుతూ, అంతవరకూ పలుకే బంగారమైన శంకర్రావు.

"ఇప్పటికైనా జనగణమన పాడొచ్చా? లేకపోతే యింకా వుందా కాశీ మజిలీ?" అంటూ లేచేడు విశ్వనాథం.

**(జ్యోతి మాసపత్రిక, 1.3.1965)**

# కుంకుమ ఖరీదు పదివేలు ...?

"మాకు హిందీ వద్దే వద్దు" తమిళులు.

చౌదరీ ఎండ్ చౌదరీ ప్రఖ్యాత పుగాకు కంపెనీ.

"హిందీ కావాలని మేమూ అనం" ఆంధ్రులు.

చౌదరీ ఎండ్ చౌదరీలో ఒక చౌదరీ చచ్చే పోయేడు.

చౌదరీ ఎండ్ చౌదరీ లక్షలు గడించిన సంస్థ, రెండవ తరం ప్రొప్రయిటర్లు యిద్దరూ పిన్తండ్రి పెత్తండ్రి పిల్లలు.

పెత్తండ్రి కొడుకు రాఘవయ్య చౌదరీకి పుగాకు వ్యాపారం సరిపడలేదు. ఆ వాసనే గిట్టలేదు. సినిమా వాసన బాగా గిట్టింది. అంచేత తండ్రి పోయేదాకా పుగాకు ఇంపు భరించి, తండ్రి చనిపోగానే పుగాకుడబ్బు లక్షపట్టుకుపోయేడు. హైదరాబాదు– లక్షలున్న పాత స్నేహితులు విశ్వనాథాన్నీ సుబ్బారావునీ కట్టుకుని మరీపోయేడు. ముగ్గురూ సినిమా కంపెనీ పెట్టారు తలో లక్షా పెట్టుబడి, "ట్రయో పిక్చర్స్" అని పేరు పెట్టారు దానికి.

పిన్తండ్రి కొడుకు రామయ్య చౌదరీకి సినిమా లిష్టమున్నా: పుగాకు వ్యాపారమంటే యింకా ఎక్కువిష్టం, అతన్ని విదేశాలు తీసుకెళ్ళిందా వ్యాపారం. ఇంద్రుడికీ ఇన్ కంటాక్సు వాళ్ళకీ దొరక్కుండా కంపెనీ నడుపుకుంటూ స్వంత వూళ్ళోనే వుంటాడు. హైద్రాబాద్‌లో లేనన్న విచారమతనికి లేదు. చాకచక్యం వుంటే తన రెండంతస్తుల మేడలో ఒక అంతస్తులో హైద్రాబాదూ, మరో అంతస్తులో హాలీ వుడ్డూ పెట్టుకోవచ్చునన్న నమ్మకం ... ఆ చాకచక్యం కూడా ఉన్నాయతనికి.

ఇంటికి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న కంపెనీకి తెరచాప లేని పడవలావున్న తన కన్వర్టిబుల్ కారులో వెళ్ళి సాయంత్రం యిల్లు చేరుకోవడం, తర్వాత మూడ్‌ని బట్టి హైద్రాబాదు అంతస్తు లోకో, హాలీవుడ్ అంతస్తులోకో వెళ్లి పోవడం అతని అలవాటు.

తొమ్మిది నెలలవగానే ట్రయోపిక్చర్సు ఆంధ్రప్రేక్షక లోకానికి ఒక క్రైమ్‌థ్రిల్లర్ అందించింది. దాంతో ఆంధ్ర చలనచిత్ర చరిత్ర మారిపోతుందని ప్రేక్షకలోకం అన్లేదు. కాని, మూడులక్షలు లాభం తాంబూలంలో పెట్టి యిచ్చింది. తాంబూలం పుచ్చు కున్నాక. మహోజ్వల చిత్రం ప్రేక్షకులకి ప్రామిస్ చేశారు పార్ట్నర్స్, భారీ ఎత్తుహిందీ టెక్నికల్ చిత్రానికి ప్లానుగీశారు. ఒక హిందీ ఆడతార బ్లాక్ మనీ ఎనిమిది లక్షలడిగి దానికి ఒప్పుకుంటే పగటి ధర చెప్తానంది. వెంటనే ఎత్తు విరమించు కొన్నారు పార్ట్నర్స్, సంగీత నృత్య ప్రధాన తెలుగు చిత్రమే తీయదల్చేరు.

"మన రెండో పిక్చరు నేను డైరెక్టు చెయ్యడం ఖాయం" అన్నాడు విశ్వనాథం.

"నేను హీరో వెయ్యడం యింకా ఖాయం" అన్నాడు సుబ్బారావు.

"నేను పాటల రాయడం మరీ ఖాయం' అని అన్లేదు రాఘ వయ్య అందామని వున్నా.

తాను హీరో వేసినా మానినా విశ్వనాథం డైరెక్టు చేయడానికి వీల్లేదన్నాడు సుబ్బారావు. తాను డైరెక్టు చేయడమన్నా మాను కుంటానుగాని సుబ్బారావు మొహానికి రంగేసుకోడానికి ఊపి రుండగా ఒప్పుకోనన్నాడు విశ్వనాథం. వీళ్ళిద్దరూ ఆ రెండు